ఒకే కాన్పులో ముగ్గురు జననం

ప్రజాశక్తి - సీతంపేట

మండలం లోని కుడ్డపల్లికి చెందిన నారా కల్యాణి సోమవారం శ్రీకాకుళం తల్లి బిడ్డ ఆసుపత్రిలో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. వీరిలో ఇద్దరు మగ శిశువులు కాగా, ఒకరు ఆడ శిశువు. తల్లి కల్యాణి, బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని తండ్రి అజయ్ కుమార్ తెలిపారు.

ముగ్గురు చిన్నారులను చూపుతున్నవైద్యాధికారి

మండలం	మొత్తం ఓటర్లు	పోలైనవి ఓట్లు	పోలింగ్ శాతం
పాలకొండ (23)	1165	804	69,01
పాలకొండ (24)	1092	730	66.85
వీరఘట్టం	1319	949	71.95
సీతంపేట	868	754	87.00
భామిని	570	446	78.25
జియ్యమ్మవలస	596	497	83.39
కురుపాం	582	503	86.43
గుమ్మలక్ష్మీపురం	608	543	89.31
బలిజిపేట (83)	703	475	67.57
బలిజిపేట (84)	688	427	62.06
మక్కువ	716	539	75.28
సాలూరు (89)	861	639	74.22
సాలూరు (90)	878	587	66.86
సాలూరు (91)	452	335	74.12
పాచిపెంట	386	296	76.68
కొమరాడ	628	461	73.41
గరుగుబిల్లి	723	530	73.31
పార్వతీపురం (75)	866	635	73.35
పార్వతీపురం (76)	846	636	75.18
పార్వతీపురం (77)	715	512	71.61
పార్వతీపురం (78)	693	497	71.72
పార్వతీపురం (79)	654	516	78.90
పార్వతీపురం (80)	653	457	69.98
సీతానగరం	1258	850	67.57
మొత్తం	18520	13619	73.54

సీతానగరం పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

- ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతం
- ఉదయం మందకొడి... మధ్యాహ్నం ఊపందుకొని..
- అత్యధికంగా గుమ్మలక్ష్మీపురంలో 89.31శాతం నమోదు
- స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

73.54 శాతం పోలింగ్

పార్వతీపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో పట్టభద్రుల శాసన మండలి సభ్యుల ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. కలెక్టర్ నిశాంత్ కుమార్ నేతృత్వంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట రావు, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ కె.హేమలత విస్తృతంగా పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలో విస్తతంగా పర్యటించారు. మొదటి రెండు గంటల సమయం ఉదయం 10 గంటల నాటికి 9.94 శాతం మందకొడిగా పోలింగ్ సాగింది. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి పోలింగ్ ఊపందు కుంది. 12గంటలకు 23.67 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట నాటికి 34.85, 2 గంటలకు 43.85, 3 గంటలకు 53.21 శాతం పోలింగ్ జరిగింది. చివరిగా 73.54 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలో మొత్తం 18,520 మంది ఓటర్లకుగానూ 13,619 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 9,002 మంది పురుషులు, 4,617 మంది మహిళలు ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఓటర్లు ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఏజెన్సీలో కూడా పోలింగ్ శాతం పెరిగింది. గుమ్మలక్ష్మీపురంలో జిల్లాలోనే అత్యధికంగా 89.31శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే సీతంపేట, జియ్యమ్మవలస, కురుపాం తదితర మండలాల్లోనూ 80శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బ్యాంక్సులను ఆయా మండలాల నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్సుల ద్వారా కలెక్టరేట్‌కు తరలించారు. వీటిని ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చారు.

జిల్లాలో 18,520 మంది ఓటర్లకు గానూ 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. వివిధ వర్గాల పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలూ తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని డిపిఎం హైస్కూల్ పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. ఎన్నికల జరుగుతున్న విధానాన్ని, చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోబడతాయని అన్నారు.

ఓట్లు గల్లంతు... ఒకేవ్యక్తికి 10ఓట్లు

బొబ్బిలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు రోజుల క్రితం వరకు ఆన్‌లైన్‌లో ఉన్న ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తల ఓట్లు గల్లంతయ్యాయి. కొందరికి ఒక్కొక్కరికీ రెండుకు పైగా ఓట్లు ఉండడం గమనార్హం. బొబ్బిలి రాజా కళాశాలలో ఓటు వేసేందుకు వచ్చిన యుటిఎఫ్ నాయకులు పి.స్వప్న, జి.శ్రీదేవి, పి.వెంకటరమణ ఓట్లు, గున్నతోటవలసకు చెందిన అంగన్వాడీ కార్యకర్త కునుకు పార్వతి ఓట్లు గల్లంతు అయ్యాయి. దీంతో ఓటు వేసేందుకు వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగారు. చింతాడకు చెందిన కర్రి లక్ష్మునాయుడుకు 85 పోలింగ్ కేంద్రంలో 10 ఓట్లు ఉండడం గమనార్హం. నకిలీ ఓట్లు ఉంచి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పడతాయను కున్న ఓట్లను తొలగించారని విమర్శలు వస్తున్నాయి.

పార్వతీపురంలో ఓటరును వీల్‌చైర్‌పై ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న సిబ్బంది

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు

సిరా గుర్తు చూపుతున్న రాజన్నదొర

ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపుతున్న కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు పుష్పశ్రీ వాణి, కళావతి; బలిజిపేటలో ఓటేస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు

సాలూరులో బారులు తీరిన ఓటర్లు

బ్యాలెట్ బాక్సులను బస్సుల్లో తరలిస్తున్న సిబ్బంది

ఓటుపై వేటు

- పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగుల ఓట్లు గల్లంతు
- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయిక్ నిరసన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలోని పలువురు పట్టభద్రుల ఓట్లు గల్లంతయ్యాయి. పోలింగ్ ముందు వరకు ఓటరు జాబితాలో పేర్లు ఉన్న పలువురు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేసరికి ఓటు లేదని అక్కడ సిబ్బంది చెప్పడంతో వారంతా నిర్ఘాంత పోయారు. ఈ విధంగా ఒక్క విజయనగరంలోని కస్పా హైస్కూలు పోలింగ్ కేంద్రంలోనే 33 మంది ఓట్లు గల్లంతయ్యాయి. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్ర పట్నాయిక్‌కు ఈ పోలింగ్ కేంద్రంలో బూతు నెంబరు 128-ఎలో సీరియల్ నెంబరు 1755తో ఆయనకు ఓటు ఉంది. తీరా ఆయన ఓటు వేసేందుకు కేంద్రంలోకి వెళ్లేసరికి ఓటరు జాబితాలో పేరు ఎదురుగా డిలిట్ అని స్టాంప్ వేసి ఉండడంతో ఆయనకు ఓటు ఇచ్చేందుకు అధికారులు నిరాకరించారు. దీంతో తన ఓటు ఎందుకు తొలగించారో చెప్పాలని ఆయన అధికారులను ప్రశ్నించడంతో పాటు నిరసన తెలిపారు. తనకు ఛాలెంజింగ్‌ఓటు అయినా ఇవ్వాలని కోరారు. ఆ సమయంలో పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన డెప్యూటీ కలెక్టర్ శ్రీకర్‌ను, తహశీల్దార్ బంగార్రాజును నిలదీశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు రాసి పంపించామని, సాయంత్రం లోపు ఓటు హక్కు కల్పిస్తామని నమ్మ బలికారు. ఓటు హక్కు కల్పించే వరకు ఇక్కడే ఉంటానని, రాజ్యాంగం కల్పించిన హక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు సాయంత్రం వరకు వేచి ఉంచి చివరకు ఏమీ చేయలేమని చేతులెత్తేశారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వి.ఆనందరావు కస్పా హైస్కూలు కేంద్రంలో ఓటు వేసేందుకు రాగా, ఆయన ఓటును ఎవరో వేసేయడంతో ఆయన నిరాశతో ఎదురు తిరిగారు. ఇలా ఈ ఒక్క కేంద్రంలోనే 33 మంది ఓట్లు గల్లంతయ్యాయి. అధికార వైసిపిపై ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ఎక్కువగా వ్యతిరేకత ఉండడంతో ఇలా ఓట్లను తొలగించారని వారంతా వాపోయారు.



నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్

జోరుగా దొంగోట్లు

విజయనగరం జిల్లా కేంద్రంలో అర్హత లేకుండా పలువురి ఓట్లను వైసిపి నాయకులు చేర్పించి వారందరితోనూ ఓట్లు వేయించారు. ఇలా వందల మంది ఓట్లు వేసినట్లు తెలిసింది. లక్కవరపుకోటలో చివరి నిముషంలో దొంగ ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి పలువురు ప్రవేశించగా ఎఎస్ఐ యువరాజు అడ్డుకున్నారు.

క్రాష్ ప్రోగ్రాం సామగ్రి పక్కదారికి యత్నం

పక్కా ప్రణాళిక గుట్టు రట్టు

ప్రజాశక్తి - కొమరాడ

వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఏటా నిర్వహించే క్రాస్‌ప్రోగ్రాం ఈ ఏడాది నిర్వహించేందుకు అధికారులు అన్నీ సిద్ధం చేశారు. అయితే మూడు నెలలుగా ప్లాన్ చేసి క్రాస్ ప్రోగ్రాంకు సంబంధించిన సామాగ్రిను పక్కదారి పట్టించేందుకు మండల స్థాయి అధికారులు ప్రయత్నించారు. సుమారు రూ.4లక్షలకు పైగా సామాగ్రి పక్కదారి పెట్టిన విషయం గుట్టురట్టు కావడంతో మళ్లీ గుట్టు చప్పుడు కాకుండా సెలవు సమయంలో తిరిగి కార్యాలయానికి తీసుకొచ్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే...

మండలంలోని బోర్ల మరమ్మతుకు సుమారు రూ.10 లక్షలు వెచ్చియించి సామాగ్రిని కొనుగోలు చేశారు. గత వారం రోజులుగా క్రాస్‌ప్రోగ్రాం ద్వారా పలు గ్రామాల్లో ఇప్పటికే బోర్లు మరమ్మతులు చేస్తున్నారు. ఇంతలోనే వరుసగా మూడు రోజులు సెలవు దినాలు రావడంతో పక్కా ప్రణాళిక ప్రకారం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి సుమారు 60 పైపులు, రాడ్లు, ఇతర సామాగ్రి విజయనగరానికి తరలినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, మండల నేతలకు తెలిసింది. వీటిని విజయనగరంలో ఓ మండల స్థాయి అధికారి ఇంట్లోనే ఆ పైపులన్నీ ఉంచడం విడ్డూరం. ఈ విషయం ఆ నోట ఈ నోట బయటపడడంతో తాము చేసిన పనిగుట్టు రట్టు అయ్యిందంటూ భయపడి అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఆదివారం సెలవు రోజులైనప్పటికీ మిట్ట మధ్యాహ్నం కార్యాలయంలో కొంతమంది ఉద్యోగులకు పిలిపించి తలుపులు తీసి పక్కదారు పట్టించిన సామాగ్రిని తిరిగి కార్యాలయంలో పెట్టించారు. అయితే క్రాస్ ప్రోగ్రాం సామాగ్రి ఉన్న గది తాళాలు లేకపోవడంతో బయట వరండాలో సామాగ్రి మొత్తం నిల్వ చేశారు. శుక్రవారం సాయంత్రం విజయనగరం తరలించిన 60 పైపులతో పాటు 40 పైపులు కూడా తీసుకొచ్చి మండల కేంద్రంలో కొన్ని ప్రదేశాల్లో దాచినట్లు సమాచారం. ఈ విషయంపై వైసీపీ నేతలు సోమవారం విలేకరుల సమావేశం పెట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా క్రాస్ ప్రోగ్రాంకు అత్యధికంగా రూ.5 లక్షల నుంచి రూ.6లక్షల వరకు బోరు సామాగ్రి కొనుగోలు చేస్తారు. అయితే ఈ ఏడాది మాత్రం ముందుగానే సామాగ్రి పక్కదారి పట్టించేందుకు పక్కాగా ప్రణాళిక రూపొందించుకొని మండల పరిషత్ నుంచి పది లక్షల రూపాయలు వెచ్చించి సామాగ్రి కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఇంత మొత్తంలో అవినీతికి పాల్పడేందుకు యత్నించిన అధికారులపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి చర్యలు చేపట్టాలని అధికారి పార్టీ నేతలు డిమాండ్ చేశారు.

ఈ విషయమైన ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు వివరణ కోరగా... గుర్ల మండలంలో పైపులు అవసరమని ఉన్నతాధికారులు చెప్పగా, విజయనగరం తరలించామని చెప్పారు. ఇక ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిని వివరణ కోరగా, కార్యాలయంలో ఉన్న సామాగ్రి తమకు ఎటువంటి సంబంధం ఉండదని బయట గ్రామాల్లో వేసిన పైపులు మాత్రమే తాము లెక్క చెప్పుకోవాలని సమాధానం చెప్పారు.

మండల పరిషత్ కార్యాలయంలోకి తిరిగి తెచ్చిన పైపులు

బిజెపి అధ్యక్షురాలి బరితెగింపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బిజెపి అధ్యక్షురాలు రెడ్డి పావని గజపతినగరంలోని తమ బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో ప్రచారం చేయించడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ ఖండించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలాజీ పాలిటెక్నికల్ కళాశాల యాజమాన్యం హాస్టల్ విద్యార్థులను జిల్లావాప్తంగా బస్సులతో పంపి బిజెపి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయించారని తెలిపారు. టెంట్లలో కూర్చోబెట్టి స్లిప్‌లు రాయించారు. మరికొన్ని చోట్ల ఏజెంట్లుగా నియమించారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో వేలకు వేలు ఫీజులు కట్టి చదవిస్తే ఎన్నికల ప్రచారం చేయించడం అన్యాయమని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా అధికారులు చూడాలని కోరారు.

నేడు డీ వార్మింగ్ డే

ప్రజాశక్తి- పాలకొండ

జిల్లాలోని పాలకొండ నియోజక వర్గ పరిధిలో ఉన్న మండలాల్లో మంగళవారం నులి పురుగుల నివారణ కార్యక్రమం (డీ వార్మింగ్ డే) నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆయన పాలకొండలో కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో 1 నుండి 19 ఏళ్ల వయస్సు గల 51,776మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో 482 అంగన్వాడీ కేంద్రాల్లో 12,400 మంది పిల్లలు, 364 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 30,202 మంది విద్యార్థులు, 27 ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 9,206మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఒకటి నుండి రెండేళ్ల పిల్లలకు సగం ఆల్బెండజోల్ మాత్ర (200 మి.గ్రా) పొడి చేసి నీరు కలిపి ఇవ్వాలన్నారు. 2 నుండి 19 ఏళ్ల పిల్లలకు ఒక ఆల్బెండజోల్ మాత్ర చప్పరించి, నమిలి నీటితో మింగాలని అదేవిధంగా గర్భిణులకు 5 నెలలు నిండిన తర్వాత మాత్రమే ఒక ఆల్బెండజోల్ మాత్ర ఇవ్వాలని అన్నారు. ఇందుకు సంబంధించి వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందికి తగు సూచనలు, శిక్షణను ఇచ్చామన్నారు. డీ వార్మింగ్ కార్యక్రమం ప్రారంభానికి ముందుగా పిల్లలు, విద్యార్థులకు చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించి, ఆల్బెండజోల్ మాత్రల ఆవశ్యకతను వివరించాలని ఆయన సూచించారు. చేతులు అపరిశుభ్రంగా ఉండటం, పరిశుభ్రంగా లేని ఆహారం తీసుకోవడం వల్ల కడుపులో నులి పురుగులు చేరే అవకాశం ఉంటుందని ముఖ్యంగా పిల్లల్లో రక్తహీనతకు, ఉదర సంబంధ సమస్యలకు, పౌష్టికాహారం లోప అనారోగ్య సమస్యలకు కారణం అవుతాయని చెప్పారు. దీంతో పిల్లలు శారీరక ఎదుగుదల సరిగా ఉండదని వీటి నివారణకు ప్రతి సంవత్సరం డీ వార్మింగ్ కార్యక్రమం ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని చెప్పారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణకు పాలకొండ మండలానికి ఆర్‌బిఎస్‌కె కో ఆర్డినేటర్ డి. భాస్కరరావు, భామినికి డిప్యూటీ డిఎమ్‌హెచ్‌ఒ విజయపార్వతి, వీరఘట్టంకి డిఐఒ టి. జగన్మోహనరావు, సీతంపేటకు డిఎల్‌ఎటిఒ శ్యామ్ కుమార్‌లను నియమించామన్నారు. ఇప్పటికే వైద్య, పంచాయతీ రాజ్, విద్యా, ఐసిడిఎస్ శాఖల అధికారులతో సమన్వయం చేశామన్నారు.

సీతంపేట : ఈ నెల 14న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో పక్కాగా నిర్వహించాలని ఐటిడిఎ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ పార్వతీ అన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించి నేషనల్ డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు.

విద్యా సంస్థకు అల్బెండ్‌జోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు

ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

భామిని: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నూరల్ కమర్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

శాసనమండలిలో ఉత్తరాంధ్ర నుంచి ప్రాతినిధ్యం వహించబోయే అభ్యర్థి ఎన్నిక సోమవారం పార్వతీపురంలో ప్రశాంతంగా జరిగింది. పట్టభద్రులు ఉదయం నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 78, 79, 80, డివిఎంఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన 75,76,77 పోలింగ్ కేంద్రాల్లో పార్వతీపురం పట్టణం, రూరల్‌కు చెందిన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ 10గంటల సమయానికి భారీగా క్యూలైన్లు కనిపించాయి. ఈసారి పోటీచేసే అభ్యర్థులు 37 మంది కావడంతో బ్యాలెట్ పత్రం పెద్దదిగా ముద్రించడం జరిగింది. బ్యాలెట్ పెద్దదికావడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో గానీ, ఎన్నికల సిబ్బంది వారికి వివరించడంలో గానీ ఎక్కువ సమయం తీసుకోవడంతో పోలింగ్ నెమ్మదిగా సాగింది. పోలింగ్ కేంద్రాలకు 100మీటర్ల దూరంలో ఏర్పాటైన అన్ని పార్టీల ఓటరు సహాయక కేంద్రాల్లో ఆయా పార్టీలకు చెందిన నాయకులు సందడి చేయగా, కోలహల వాతావరణం నెలకొంది. అధికార పార్టీకి చెందిన వైసిపి కార్యకర్తలు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్యర్వంలో బహిరంగంగానే ప్రచారం నిర్వహించడంతో ప్రజాసంఘాలకు చెందిన వారు ఫిర్యాదు చేయడంతో డిఎస్‌పి ఎ.సుభాష్ వారి వద్దకు వెళ్లి వారించడంతో కొంత సేపు నిశ్శబ్ధంగా ఉన్నప్పటికీ ఆ తర్వాత తమ వైఖరిని ఎమ్మెల్యే బలిజిపేట వెళ్లేంత వరకూ కొనసాగించారు. అయితే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తమ విధులు నిర్వహించగా, ఎన్నికల జరుగుతున్న తీరును ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు.

పాలకొండ : స్థానిక ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నిక సోమవారం ప్రశాంతంగా జరిగింది. సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ పర్యవేక్షణలో పోలింగ్ జరిగింది. పాలకొండ, రాజాం నియోజకవర్గాల్లోని జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 153 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 149 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంతకవిటి, రాజాం, వీరఘట్టం నుంచి ఎంపిటిసిలు ముగ్గురుతో పాటు పాలకొండ నగర పంచాయతీ పరిధిలో ఒక కౌన్సిలర్ ఓటుహక్కు వినియోగించుకోలేదు. డిఎస్‌పి జివి కృష్ణారావు, సిఐ కె.మురళీధర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రులకు సంబంధించి మండలంలోని 2257 మంది ఓటర్లకు గానూ 1534మంది (67శాతం) ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సాలూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 89, 90పోలింగ్ కేంద్రాల్లో పట్టణ ఓటర్లు, 91పోలింగ్ కేంద్రంలో గ్రామీణ ఓటర్లు ఓటు వేశారు. మొత్తం 2190ఓటర్లకు గానూ 1562మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యాన పోలింగ్ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలను ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్, ఆర్‌డిఒ హేమలత, డిఎస్పీ సుభాష్ పరిశీలించారు.

జియ్యమ్మ వలస : స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు కాగా పోలీస్ అధికారుల పర్యవేక్షణలో ఓటర్లను మాత్రమే పోలింగ్ కేంద్రంలోనికి అనుమతించారు. పోలింగ్ కేంద్రం ముందు ఓటర్లను తనిఖీ చేసిన తర్వాత మాత్రమే లోపలికి విడిచిపెట్టారు. పోలింగ్ కేంద్రంలోనికి ఫోన్లు, బ్యాగులు, వాచీలను తీసుకెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యేను కూడా పోలీసులు తనిఖీలు చేసి పోలింగ్ కేంద్రంలోనికి పంపడం చర్చనీయాంశంగా మారింది. మండలంలో 596 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 497 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 83.33 శాతం మండలంలో నమోదైయ్యింది. స్థానిక ఎస్సై పి.అనీష్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో బైండోవర్ కేసులు నమోదైన వారిలో 13మందిని ఎన్నికల కారణంగా ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. చిన్నమేరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో డొంకాడ రామకృష్ణ పళ్ల రాంబాబును అదుపులోకి తీసుకున్నారు.

కురుపాం: మండలంలో 582 మంది ఓటర్లు ఉండగా, 502మంది ఓట్లు హక్కు వినియోగించుకున్నారు. 86.42 శాతం నమోదయింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నురుల్ కమర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్ .రమేష్ కుమార్, ఆర్ ఐ ప్రసాద్ , పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఎస్సై సిహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. అలాగే గరుగుబిల్లి మండలంలో 723మంది ఓటర్లకు గానూ 529మంది (73.16శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బలిజిపేట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. 1391 ఓట్లకు 902 ఓట్లు పోలయ్యాయి. 64.84 శాతం నమోదయింది. పార్వతీపురం ఎమ్మెల్యే ఎ.జోగారావు, ఆయన భార్య తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ మందకొండిగా సాగడంతో 5గంటల వరకు పోలింగ్ జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భామిని : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటింగ్ పోలింగ్ బూత్‌లో ఎన్నిక ప్రశాంతంగా జరిగినట్టు తహశీల్దార్ అప్పారావు తెలిపారు. భామిని మండలంలో 570 మంది పట్టభద్రులు ఓట్లు ఉండగా, 446 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 78.25 నమోదైనట్లు తహశీల్దార్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ పోలింగ్ బూత్‌లో పరిశీలించారు. అభ్యర్థి ఐడి ప్రూఫ్ పరిశీలించాకే ఓటింగ్ ప్రక్రియకు అనుమతించాలని సిబ్బందిని సూచించారు.

కొమరాడ : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ బూత్‌ల వద్దకు పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలను ఎస్సై జగదీష్ నాయుడు ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేశారు. ఆర్డీవో హేమలత పోలింగ్ స్టేషన్లు సందర్శించి సిబ్బంది సూచనలు సలహాలు చేశారు. నాలుగు గంటల వరకు పోలింగ్ బూత్ లోనికి ఓటర్లకు పోలీసులు అనుమతించారు సుమారు ఐదు గంటల వరకు పోలింగ్ జరిగింది. మండలంలో 607మంది పట్టభద్రులకు గానూ 462 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మక్కువ : మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ మందుకొడిగా సాగింది. బ్యాలెట్ నమూనా పెద్దగా ఉండడంతో వాటరు బ్యాలెట్ బాక్స్‌లో వేసేందుకు కాస్త ఇబ్బంది పడ్డారు. 716 మంది ఓటర్లకు గాను 536 మంది (74శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్‌డిఒ కె.హేమలత పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సాలూరు సిఐ ధనుంజయ్ రావు దగ్గరుండి శాంతి భద్రతలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీతంపేట: స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 868 ఓటర్లకు గానూ 754మంది (87శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ సందర్శించి అప్రమత్తం చేశారు. ఐటిడిఎ పిఒ బి.నవ్య పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ఎన్నికల అధికారి అమరేశ్వరి పోలింగ్ నిర్వహణ అధికారి ఎస్.నరసింహమూర్తి, ఎన్నికల సెక్టోరియల్ అధికారి జి.మురళి, దోనుబాయి ఎస్సై కిషోర్ వర్మ, సీతంపేట ఎస్సై నీలకంఠరావు ఎటువంటి అసంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో 1258మంది ఓటర్లకు గానూ 850 ఓట్లు (83శాతం)పోలయ్యాయి. పోలింగ్ మందకొడిగా సాగడంతో ఓట హక్కును వినియోగించుకొనేందుకు ఓటర్లు నిరీక్షించారు. దీంతో పోలింగ్ సాయంత్రం 6గంటల వరకూ సాగింది.

పాచిపెంట : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 386 ఓట్లు గాను 295 ఓట్లు (76.42 శాతం) ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డిఒ కె.హేమలత పరిశీలించారు. తహశీల్దార్ ఎం.రాజశేఖర్, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, ఎస్ఐ ఎం.వెంకటరమణ పోలింగ్ నిర్వహించారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఎమ్మెల్యే కళావతి జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, వైస్ ఎంపిపి విజయ కుమారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో 1319 ఓట్లుకు గాను 949 ఓట్లు పోలయ్యాయి. 71.94 శాతం నమోదయింది. తహశీల్దార్, ఎంపిడిఒ ఎస్ఐ పర్యవేక్షించారు.

మక్కువ: ఓటేసేందుకు చంటిబిడ్డతో వస్తున్న మహిళా ఓటరు

ఏజెన్సీలో పెరిగిన ఓటింగ్ శాతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఈసారి ఎన్నికల్లో ఎక్కువ శాతం మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత పదేళ్లతో పోల్చుకుంటే పట్టభద్రుల్లో చైతన్యం పెరిగింది. దీంతో ఈసారి ఓటింగ్ శాతం ప్రక్రియ గణనీయంగా పెరిగింది. మొన్నటి వరకూ 60 శాతం మాత్రమే పోలింగ్ శాతం నమోదైతే ఈసారి ఎన్నికల్లో ఏకంగా ఆ సంఖ్య 89.3 శాతానికి చేరుకుంది. మండలంలో 608మంది ఓటర్లు ఉండగా 543మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దూర ప్రాంతాల్లోని ఓటర్లు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు . ఎన్నికల ప్రక్రియను ఎంపిడిఒ సాల్మన్‌రాజు, తహశీల్దార్ రాములమ్మ పర్యవేక్షించారు. ఎల్విన్‌పేట, చిన మేరంగి ఎస్ఐలు షణ్ముఖరావు, కళాధర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

24 కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లు పార్వతిపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి. జగన్నాథరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలో పార్వతిపురంలో 6, సాలూరులో 3, సీతంపేట 1, పాలకొండ 2, వీరఘట్టంలో 1, జిఎం వలస, మక్కువ, కొమరాడ తదితర పోలింగ్ కేంద్రాల్లో 24 వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఈయనతో పాటు స్థానిక వైద్యులు పి ఉమామహేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి, ఏఎన్ఎం ఉష, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం: ఎండలో క్యూలో నిల్చున్న ఓటర్లు

కురుపాం: ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

పార్వతీపురం : బారులు తీరిన ఓటర్లు

పాచిపెంట: అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత

గుమ్మలక్ష్మీపురం: క్యూలో నిలబడిన పట్టభద్రులు

విద్యా వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

కురుపాం : ఐటిడిఎ పరిధిలో కొనసాగుతున్న సవర భాష విద్యా వాలంటీర్లను ప్రభుత్వం తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలో ఆమె పత్రిక విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో గిరిజన విద్యార్థులకు సవరభాష ద్వారా వారికి అర్థమయ్యే భాషలో విద్యను అభ్యసించేందుకు ప్రత్యేకంగా అప్పటి ప్రభుత్వం 332 మందిని నెలకు రూ.5వేలు జీతం ఇస్తూ నియమించిందన్నారు. దీంతో వారు వారి గ్రామాల్లో ఉంటూ కొంత కుటుంబ పోషణకు ఉపయోగపడుతూ గిరిజన విద్యార్థులకు వారికి అర్థమయ్యే భాషలో విద్యను అందించేవారిని చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా వారిని తొలగించారంటే గిరిజనులకు విద్యను దూరం చేయడమే తప్ప వేరే ఉద్దేశం కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి తక్షణమే సవర భాష వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని లేనిచో వారి పక్షాన ఆందోళనలు నిరాహార దీక్షలు చేసి వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, సవర భాష వాలంటరీ సంఘ నాయకులు వెంకటేష్, గిరిజన సంఘం నాయకులు ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన నాటుసారా, ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నాటు సారా స్థావరాలపై మెరుపు దాడులు

18వేల లీటర్ల బెల్లం ఊట, 220 లీటర్ల నాటు సారా ధ్వంసం

పార్వతీపురం టౌన్ : ఎస్ఇబి పోలీసులు, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఆంధ్ర ఒడిషా సరిహద్దు సమీపంలో పూర్తిగా ఆంధ్ర ప్రాంత గ్రామాలకు నాటు సారా రవాణా చేసే ఒడిషా గ్రామలైన హాటిగడ, రేవటిగుడ సమీపంలో కొండ ప్రాంతంలో నాటు సారా స్థావరాలపై సోమవారం దాడులు చేశారు. 18వేల లీటర్ల నాటు సారా తయారు చేసే బెల్లం ఊటలు, 220 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఒడిషా అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో తనతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సతీష్, ఎస్ఐలు జె.రాజశేఖర్, శేఖరం, రమణ, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఒడిషా ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

వాహనదారులతో మాట్లాడుతున్న ఆర్‌టిఒ మల్లిఖార్జున రెడ్డి

వాహనాలకు అన్ని పత్రాలూ ఉండాలి

కురుపాం : వాహనాలు నడిపే వ్యక్తులకు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి అన్ని పత్రాలు కలిగి ఉండాలని ఆర్‌టిఒ మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని రావాడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ ట్యాక్స్ తప్పనిసరిగా కట్టాలన్నారు. ట్యాక్స్ కట్టని వాహనాలు తనిఖీల్లో దొరికినట్లయితే 200 శాతం జరిమాన విధించడం జరుగుతుందన్నారు. హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు అన్ని వాహనాలకు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్యాసింజర్స్‌కి ఎక్కించినట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు శశి కుమార్, రమేష్ కుమార్, ఆర్‌టిఒ సిబ్బంది పాల్గొన్నారు.

క్షణక్షణం.. భయం భయం

- ఏనుగుల గుంపుతో నాశనమవుతున్న పంటలు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాశక్తి - వీరఘట్టం

విజయనగరం జిల్లా వంగర మండలం నుండి గత నెల 17వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం పరిధిలోని కిమ్మి, నడుకూరు గ్రామాల సరిహద్దుల్లోకి ఏనుగుల గుంపు ప్రవేశించి అక్కడ తిష్ట వేశాయి. అప్పటి నుండి కొట్టుగుమ్మడ, చిట్టపూడి వలస గ్రామాల సరిహద్దుల్లో సంచరించి చెరుకు, మొక్కజొన్న, కొబ్బరి చెట్ల నాశనంతో పాటు ధాన్యం బస్తాలు కూడా ధ్వంసం చేయడంతో అన్నదాతలు, ప్రజలు అనుక్షణం భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామానికి సమీపంలో ఏనుగుల గుంపు సంచరించటం వల్ల ఏ సమయంలోనైనా గ్రామాన్ని చుట్టు ముడతాయేమోనని రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా కాలం వెల్లదీస్తున్నారు.

పొలంలోకి వెళ్లాలంటేనే భయం

ఏనుగులు గుంపు కారణంగా బోరు బావుల ద్వారా పంట పొలాలకు నీరు కట్టేందుకు కూడా వెళ్లలేక పోతున్నామని, నీరు లేక ఎండుతున్న పంటలు, ఏనుగులు సంచార కారణంగా నాశనం అవుతున్న పంటల వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 4న కిమ్మి గ్రామ సరిహద్దుకు ఏనుగుల గుంపు చేరాయి. ఏనుగులు దాహార్తిని తీర్చేందుకు నీరు లేకపోవడంతో అవి ఇదే గ్రామానికి చెందిన రౌతు పోలినాయుడు, గవర గంగు నాయుడు, బి. అసిరి నాయుడులకు చెందిన బోరు బావుల పైపులను ధ్వంసం చేశాయి. పక్కనే ఉన్న మొక్కజొన్న పంటలు కూడా నాశనం చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఈ నెల ఒకటిన విక్రంపురం గ్రామానికి చెందిన మాచర్ల రాజు కిమ్మి గ్రామం వెళ్లి తిరిగి రాత్రి 10గంటల సమయంలో స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గం మధ్యలో ఏనుగులు గుంపు ప్రధాన రహదారికి అడ్డంగా ఉండటాన్ని గమనించి ప్రాణ భయంతో ద్విచక్ర వాహనం విడిచి అక్కడి నుంచి పారిపోయాడు. ఇటువంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు.

కిమ్మిలోని పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

హామీలు హుళక్కే..?

ఏనుగుల గుంపుని తరలించడంతోపాటు పంట నష్టపరిహారాన్ని అందిస్తామని గత నెల 21న స్థానిక ఎమ్మెల్యే వి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌లు ఏనుగుల సంచారం వల్ల నష్టపోయిన పంటలు పరిశీలించిన సందర్భంగా రైతులకు భరోసా ఇచ్చారు. వీరు పరిశీలన జరిపి దాదాపుగా రెండు వారాలు కావస్తున్నప్పటికి ఎటువంటి చర్యలూ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. నాయకుల హామీలన్నీ హుళక్కేనని ఎద్దేవా చేస్తున్నారు. సుధీర ప్రాంతాలకు ప్రయాణం సాగించలేక, పంట పొలాలకు పనులకు వెళ్లలేక తీవ్ర భయమందోళనకు గురవుతున్నట్లు ప్రజలు, రైతులు చెబుతున్నారు. ఏనుగుల గుంపు ఇతర ప్రాంతాలకు తరలించేంత వరకూ పంటల సాగు చేయలేమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులు గుంపు కారణంగా ఎటువంటి ప్రాణ, పంట నష్టం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకొని ఈ ప్రాంత నుండి అటవీ ప్రాంతాలకు ఏనుగుల గుంపును తరలించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు .

సామాజిక ప్రేమికుడు.. నిరంతర సాధకుడు

- హెచ్ఐవి రోగులకు ఆత్మబంధువు జిల్లెల్ల
- 80 ఏళ్ల వయసులోనూ సమస్యలపై పిటిషన్లు

ప్రజాశక్తి - సాలూరు

ఆయనో సామాజిక ప్రేమికుడు, నిరంతరం ఏదో ఒక ప్రజాసమస్యపై పరిష్కారానికి సాధన చేసే సేవకుడు. పట్టణ ప్రజలు, అధికారులు ప్రజాప్రతినిధుల తలలో నాలుకలా వ్యవహరిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఎప్పటికప్పుడు వారి దృష్టిలో పెడుతోన్న విక్రమార్కుడు. 80ఏళ్ల వయసులోనూ సామాజిక సేవే ఊపిరిగా పనిచేస్తున్న శ్రామికుడు పట్టణానికి చెందిన జిల్లెల్ల సీతారాం. ఆయన పేరు తెలియని అధికారి లేరు. పట్టణానికి సంబంధించిన ప్రజా, సామాజిక సమస్యలను నిత్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతుల రూపంలో ఆయన అందజేస్తుంటారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఏదో ఒక వర్గం ప్రజలపైనో, పట్టణాభివృద్ధికి సంబంధించిన సమస్యపైనో ఫిర్యాదు అందిస్తుంటారు. నడవడానికి ఓపిక లేకపోయినా ఎవరో ఒకర్ని తోడు తీసుకొని గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు అందజేయడానికి ఆయన హాజరవుతారు. హెచ్ఐవి రోగుల సంక్షేమ సంఘం, వినియోగుల మండలి వంటి సంఘాల్లో కీలకపాత్ర పోషిస్తూ పట్టణ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు స్థానిక ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు అందజేస్తుంటారు. రాయగా రాయగా కరణం, పాడగా పాడగా మరణం అన్నట్లు సమస్య పరిష్కారమయ్యేంత వరకు పట్టువదలని విక్రమార్కుడిలా తిరుగుతూనే ఉంటారు. ఎయిడ్స్ రోగులకు పింఛన్లు, అంత్యోదయ రేషన్ కార్డులు, బస్సు పాసులు ఇప్పించడంలో ఆయన చేసిన కృషి అమోఘం. అప్పుడప్పుడు దాతల సహకారంతో నిరుపేదలైన ఎయిడ్స్ రోగులకు పౌష్టికాహార సరుకులు కూడా ఆయన పంపిణీ చేయిస్తుంటారు. గతంలో మూడు దశాబ్దాల పాటు పరిష్కారానికి నోచుకోని బైపాస్ రోడ్డు కోసం కూడా ఆయన పట్టణ ప్రముఖులతో కలిసి అనేక సార్లు వినతులు అందజేశారు. ఎట్టకేలకు డిప్యూటీ సీఎం రాజన్నదొర సహకారంతో బైపాస్ రోడ్డు పూర్తయ్యే దశకు చేరుకుంది. పట్టణంతో పాటు సమీప గ్రామాలకు చిరకాల వాంఛగా ఉన్న రైలు బండి సౌకర్యం కోసం కూడా ఆయన నిరంతర పోరాటం చేస్తున్నారు. ఒకప్పుడు సాలూరు నుంచి బొబ్బిలి వరకు రైలు బస్సు తిరుగుతుండేది. బ్రిటీష్ కాలం నాటి రైలు బస్సు స్థానంలో రైలు బండి నడపాలని ఆయన చాలా సార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు, రైల్వే అధికారులకు వినతులు అందించారు. రెండేళ్ల క్రితం సాలూరు నుంచి బొబ్బిలి మీదుగా విజయనగరం వరకు రైలు బండి పాసింజర్ నడపాలని రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి రైలు మార్గం కూడా నిర్మించారు. కానీ ఇంతవరకు అది కార్యరూపం దాల్చలేదు. సాలూరు ప్రాంత వాసులకు రైలుకూత వినిపించాలని సామాజిక కార్యకర్త జిల్లెల్ల సీతారాం గాంధేయ మార్గంలో పోరాడుతున్నారు. పట్టణ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా దీర్ఘకాలంగా ఆయన కృషి చేస్తున్నారు..



పిటిషన్లు చూపిస్తున్న జిల్లెల సీతారాం

తొలి తెలుగు విదుషీమణి మొల్లమాంబ

పార్వతీపురం టౌన్ : రామాయణాన్ని రాష్ట్ర ప్రజలకు పరిచయం చేసిన తొలి తెలుగు విదుషీమణి మొల్లమాంబ అని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఉన్న కుమ్మరివీధి కూడలి వద్ద శ్రీచంద్రమౌళీశ్వర శాలివాహన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆధునిక రామాయణ కవయిత్రి అతుకుల మొల్ల విగ్రహాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల కాలంలో సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలుగులోకి ఆమె అనువదించినట్టు తెలిపారు. మొల్ల తెలుగు రామాయణ సరళి రమణీయమైందని, పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతంలో తొలిసారిగా ఈ మహా కవిత్రి విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం పూర్వజన్మ సుకృతమని, శాలివాహన సేవ సంఘానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.

బంగార్రాజు పేటలో సరుగుడు తోట దగ్ధం

డెంకాడ : మండలంలోని బంగార్రాజు పేటలో ఐదు ఎకరాల సరు గుడు తోటకు ఆదివారం రాత్రి మంటలు అంటుకోవడంతో దగ్ధమైంది. సోమవారం ఉదయం గ్రామస్తులు యజమానికి సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి నాలుగు ఎకరాల సరుగుడు తోట అప్పటికే దగ్ధమైంది. దీంతో 15 లక్షలు నష్టం వాటిల్లిందని తోట యజమాని మండల టిడిపి నాయకుడు కాగితాలు సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సర్వే నెంబర్ నాలుగులో 8 ఎకరాల సరుడు తోట ఉందని అది కోతకు వచ్చిందన్నారు. దానిని రూ.15లక్షలకు వ్యాపారస్తులు అడిగారని ఇంతలోని ఇలా కాలిపోయిందన్నారు. ఇదంతా గ్రామానికి చెందిన గిట్టని వారు రాజకీయ కక్షతో చేసి ఉంటారని ఆయన ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేస్తానని ఆయన వెల్లడించారు.

మదనాపురంలో పులి కలకలం

గంట్యాడ : మండలంలోని మదనాపురం గ్రామ శివారులో గేదె దూడపై పులి దాడి చేసి హతమార్చింది. సోమవారం ఈ విషయం వెలుగు చూసింది. పులి దాడిలో గ్రామానికి చెందిన వర్రి శ్రీనుకు చెందిన గేదె దూడ మృతిచెందింది. దూడ కళేబరం ఉన్న ప్రదేశంలో పాదముద్రలు పులివిగా అనుమానించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పులి పాద ముద్రలుగా నిర్ధారించారు. పులి దాడి కారణంగానే గేదె దూడ మృతి చెందినట్లు తేల్చారు. అటవీ శాఖ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అడవికి వెళ్లవద్దని అప్రమత్తం చేశారు.

జాకేరులో ఫీవర్ సర్వే

వేపాడ : మండలంలోని జాకేరు గ్రామంలో సోమవారం వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. ఈ సర్వేలో ఏఎన్ఎం లక్ష్మి, వాలంటీర్ శివ, గ్రామ నాయకులు అప్పలనాయుడు పాల్గొన్నారు.

'శారద'లో భద్రతా వారోత్సవాలు

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి వద్దనున్న శారద పరిశ్రమలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జివివిఎస్ నారాయణ మాట్లాడుతూ ఫ్యాక్టరీలో సేఫ్టీ విధానం తూచ తప్పక పాటించాలన్నారు. ఫ్యాక్టరీలో పనిచేసేవారు పరిశ్రమ విధానాలను పాటించకుంటే ప్రమాదాలకు గురయ్యే అవకాశముందన్నారు. కార్మికులు పాటించాల్సిన భద్రతా నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో మెకానికల్ అండ్ మెయింటైనెన్స్ సీనియర్ జిఎం అనంత్ కుమార్), పిపి ఆపరేషన్ జిఎం సన్యా పరక్, ఫేడ్ ఆపరేషన్ డిజిఎం టి.వెంకట్‌శివ, డిజిఎం సన్యాసిరావు, ఎజిఎం ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.